సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



రాజన్న శరణు

వేములవాడ: రాజన్నను శనివారం 15 వేల మంది దర్శించుకున్నారు. వరుస సెలవులు రావడంతో వేలాది మంది వస్తున్నారు.



ప్రతిష్ఠాపనోత్సవాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): బట్టోనితాళ్లలో శ్రీమల్లిఖార్జున, కేతమ్మ–మ్యాడలమ్మ సమేత ఎల్లమ్మ మునిరాజు ప్రతిష్ఠ ఉత్సవాలు జరిగాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ ఉంటుంది. తెల్లవారుజామున ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

టెక్స్‌టైల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కోడం రమణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): టెక్స్‌టైల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. టెక్స్‌టైల్ పార్క్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒకప్పుడు 111 పరిశ్రమలలో దాదాపు 1500 మంది కార్మికులకు ఉపాధి దొరికేదని, ఇప్పుడు పరిశ్రమలు తరలిపోయి 50 మాత్రమే నడుస్తున్నాయన్నారు. ఇప్పుడు 600 మంది కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. పరిశ్రమలు మూతపడి కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీ అందించడంలోనూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, నాయకులు అక్కల శ్రీనివాస్, ఆడెపు శుభోశేఖర్, జెల్ల సదానందం, ఆంజనేయులు, సంపత్, రవి, శ్రీనివాస్, నరేశ్, వేణు, వరప్రసాద్, అశోక్, శ్రీకాంత్, రంగయ్య, రమేశ్ పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకెళ్లండి



మాట్లాడుతున్న ట్రైనర్ ధర్మేందర్

వేములవాడరూరల్: విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలని ఇంటర్‌నేషనల్ ట్రైనర్ ధర్మేందర్ సూచించారు. వేములవాడ మండలం మర్రిపల్లి కేజీబీవీలో యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ ఫ్యూచర్ పేరుతో కరీంనగర్‌కు చెందిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల సమయంలో దిగులు చెందొద్దన్నారు. కరీంనగర్ జూనియర్ ఛాంబర్ ఇంటర్‌నేషనల్ ఎక్స్‌లెన్స్ అధ్యక్షురాలు రాధికరాణి, అంజిబాబు, గీతారాణి, సీహెచ్.పద్మజ, కళాశాల ప్రత్యేకాధికారి శకుంతల, సర్పంచ్ కట్కం మల్లేశం పాల్గొన్నారు.

నిరుపేదల ఇళ్ల కోసం పోరాడుతాం



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాని నిరుపేదలకు న్యాయం జరిగేలా సీపీఎం ఆధ్వర్యంలో పోరాడుతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రాని పేదలకు ప్రభుత్వం 120 గజాల స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించుకునేందుకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 13 నుంచి సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్ ఎదుట నిరాహారదీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. కోడం రమణ తదితరులు ఉన్నారు.

తురకకాశీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లఅర్బన్: తురక కాశీల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో విలీనమైన పెద్దూరు పరిధిలోని తుర్కాశిపల్లెను శనివారం పరిశీలించారు. వేణు మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వీరు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు లేవన్నారు. ఈ కాలనీలో వంద మందికి పైగా చిన్నారులు ఉన్నా అంగన్‌వాడీ కేంద్రం లేదన్నారు. తురక కాశీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పంతం రవి, మల్లేశంగౌడ్, పాల చంద్రయ్య, లక్ష్మణ్, మోహన్ ఉన్నారు.

ఆశ్రమాల్లో అనాథలుగా..

అయినవారు అందరూ ఉన్నా.. పట్టించుకునేవారు లేక

సండే స్పెషల్



నాపేరు సునీత. వయసు 68 ఏళ్లు. రోడ్డుపై ఒంటరిగా ఉన్న నన్ను నాలుగేళ్ల క్రితం రామగుండం కార్పొరేటర్ ఎండీ. ముస్తాఫా పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర ఆశ్రమంలో చేర్పించాడు. బంధువులు ఎందరో ఉన్నా.. ఆదరణ లేక ఇక్కడే ఉంటున్నా. కాళ్లనొప్పులు, ఆస్తమా సమస్యలతో బాధపడుతున్నా. ఆశ్రమ నిర్వాహకుడు నాకు మూడుపూటల భోజనం పెట్టి కొడుకులా చూసుకుంటున్నాడు.



నా పేరు వైద్యుల మల్లారెడ్డి. మా ఆవిడ పేరు రాజవ్వ. సొంతూరు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్. వ్యవసాయం చేసుకుంటూ బతికేటోళ్లం. మంచిగా ఆస్తి సంపాదించిన. కొడుకులు బాసటగా ఉంటారనుకున్నా. కానీ ఉన్న ఆస్తిని వాళ్లపేరున చేయించుకున్నారు. మా ఇద్దరిని వెళ్లగొట్టారు. ఐదేళ్లుగా గోదావరిఖనిలోని శ్రీధర్మశాస్త్ర వృద్ధుల సేవా ఆశ్రమంలో ఉంటున్నాం. మాకు కొడుకులు, బిడ్డలు.. వాళ్ల పిల్లలతో హాయిగా ఆడుకోవాలని, కలిసిఉండాలని అనిపిస్తుంది. కానీ కన్న రక్తం మమ్మల్ని గెంటేశాక దినమొక నరకంగా బతుకుతున్నాం.



నాపేరు శ్రీపతి లక్ష్మి. మాది రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకెపల్లి. భర్తకు పక్షవాతం వచ్చి చనిపోయిండు. నాకు ముగ్గురు కొడుకులు.. ముగ్గురు కూతుళ్లు. ఏం లాభం.. బుక్కెడు అన్నం పెట్టేందుకు ఎవరికీ చేతులు రావడం లేదు. అందరూ కలిసి ఇంట్లోంచి వెళ్లగొట్టారు. తెలిసినోళ్లు గోదావరిఖనిలోని ఆశ్రమంలో ఉంచారు. కొన్నేళ్లుగా ఇక్కడే బతుకుతున్న. కడుపున పుట్టిన ఆరుగురు ఉన్నా అనాథగా ఉంటున్న.



జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామానికి చెందిన కట్కూరి రాజయ్య, రాజవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఎవరికి వారు బతుకుతున్నారు. కొడుకులు ముగ్గురూ వంతులవారీగా తల్లిదండ్రుల బాగోగులు చూస్తున్నారు. అయితే.. వృద్ధాప్యానికి తోడు రాజయ్య దంపతులను అనారోగ్య సమస్యలు వెంటాడాయి. ఆస్పత్రిలో చూపించుకునేంత స్తోమత లేదు. కొడుకులను ఇబ్బంది పెట్టేందుకు ఇష్టం లేదు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 10వ తేదీన దంపతులు ఇద్దరూ సూసైడ్ నోటు రాసి ఆత్మహత్య చేసుకున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని.. నోటులో రాశారు.

- తోడులేక.. నీడలేక వృద్ధుల పాట్లు
- చివరి అంకంలో ఆశ్రమాల్లో బతుకీడుస్తూ..
- పిల్లలకు భారంగా ఉండలేక.. బాధను దిగమింగలేక..
- బలవన్మరణానికి పాల్పడుతున్న మరికొందరు

నవమాసాలు మోసి పురిటినొప్పులను ఆనందంగా భరిస్తుంది తల్లి. తన రక్తాన్ని పాలుగా మలిచి ఆకలిని తీరుస్తుంది. బిడ్డకు చిన్న ఆపదొచ్చినా.. కన్నపేగు విలవిల్లాడుతుంది.

బుడిబుడి అడుగులు వేసే సమయంలో వెన్నంటే ఉంటాడు నాన్న. జీవితంలో తప్పటడుగులు వేయకుండా దారి చూపుతాడు.

పిల్లలు భవిష్యత్‌లో ఇబ్బంది పడొద్దని అన్ని విధాలా సమకూరుస్తారు తల్లిదండ్రులు. సమాజంలో దర్జాగా తిరిగేలా చేస్తారు. పిల్లలను ఉన్నతంగా స్థిరపరిచేందుకు జీవితాన్నే దారబోస్తారు. అయితే.. రెక్కలొచ్చిన పక్షుల్లాగా.. కొందరు పిల్లలు మలివయసులో తల్లిదండ్రులను అనాథలను చేస్తున్నారు. తమకు భారంగా ఉంటున్నారని ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. వృద్ధాప్యంలో పిల్లలకు భారం కావొద్దని కొందరు తనువు చాలిస్తున్నారు.

– సాక్షి, కరీంనగర్ డెస్క్

మారుతున్న కాలం..

ఒకప్పుడు కుటుంబం అంటే తల్లి,తండ్రి.. కొడుకు, కోడలు.. పిల్లలుగా భావించేవారు. ఇప్పుడు పెళ్లయిన కొన్నాళ్లకే తల్లిదండ్రులను దూరం పెడుతున్నారు. వారి నుంచి సంక్రమించే ఆస్తిపాస్తులు దక్కించుకుని తల్లిదండ్రులను కూడా పంచుకుంటున్న ఘటనలు తరచూ కళ్లముందు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే ఆస్తిని దక్కించుకుని తల్లిదండ్రులను దూరం కొడుతున్నారు. మరికొందరైతే ఉద్యోగం రీత్యా దంపతులు ఇద్దరూ బిజీగా ఉంటున్నామని తల్లిదండ్రులను ఆశ్రమాల్లో అప్పగించేస్తున్నారు. వారికి నెలకు కావాల్సిన భత్యం కూడా నిర్వాహకులకు అందిస్తున్న వైనం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు వృద్ధాశ్రమాల్లో కనిపిస్తోంది.

ఆదరణ లేక.. ఆరోగ్యం సహకరించక..

పిల్లలు జీవితంలో స్థిరపడిన తరువాత తల్లిదండ్రులు కోరుకునేది వారి నుంచి ప్రేమను మాత్రమే. అయితే ఆ ప్రేమను పొందలేక.. ఆదరణ లభించక చాలా మంది వృద్ధులు కుమిలిపోతున్నారు. మలివయసులో వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో కొడుకులకు భారం కావొద్దని జగిత్యాల జిల్లాలో ఓ వృద్ధ జంట ఆత్మహత్య చేసుకోవడం విషాదం నింపింది. కొడుకులకు లక్షల ఆస్తిని పంచి ఇచ్చినా బుక్కెడు బువ్వ పెట్టకుండా తండ్రిని గ్రామపంచాయతీ వద్ద వదిలివెళ్లిన ఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో చోటుచేసుకుంది. గతేడాది సెప్టెంబరు 13న వేములవాడ



రూరల్ మండలం పట్టెంల గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారిని కలిసి తన కొడుకు పైసలిస్తలేడని ఎట్ల బతకాలి అని ఫిర్యాదు చేశాడు. ఇవే కాదు.. జిల్లాలో వెలుగులోకి రాని ఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతున్నాయి. తమకొడుకులు పట్టించుకోవడం లేదని నిత్యం ఏదో ఒక పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు పండుటాకులు. అనారోగ్యం.. ఆర్థిక, కుటుంబ సమస్యలు... పిల్లలు చేరదీయక పోవడంతో రెండేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో 120 మందికి పైగా వృద్ధులు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి.

వృద్ధుల రక్షణ చట్టం

2007లో 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టం'ను పార్లమెంట్ ఆమోదించింది. తల్లిదండ్రుల విషయంలో వారి పిల్లలు వ్యతిరేక ధోరణితో అనుసరిస్తున్న వైఖరికి ఈ చట్టం రక్షణగా నిలుస్తోంది. తల్లిదండ్రులను నిరాధరణకు గురిచేసినవారికి 3నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తారు. తల్లిదండ్రుల పోషణ, వైద్యానికి అయ్యే ఖర్చులు కూడా చెల్లించాలని చట్టం నిర్దేశిస్తోంది. తల్లిదండ్రులకు ఏమైనా స్థిరాస్తులు ఉంటే వాటిని పొందడానికి కూడా వీలులేకుండా వారసులను అనర్హులుగా నిర్ణయించవచ్చు. ప్రతీ జిల్లాలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి అభాగ్యులైన వృద్ధ దంపతులకు అండగా నిలిచే యంత్రంగాన్ని ఏర్పాటు చేయాలని చట్టం చెబుతోంది. ట్రిబ్యునల్ నిర్ణయం మీద అప్పీలు ఉండదు. కేసు పెండింగ్‌లో ఉన్నకాలంలో నెలసరి భత్యం కూడా చెల్లించాలి. విచారణ చేపట్టే ముందు తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సయోధ్య చేపట్టాలి. ఈ చట్టం కింద తాత, అమ్మమ్మ, నాయనమ్మల పోషణ కూడా కొడుకులు, మనవలు, దత్తపుత్రుల బాధ్యత. అయితే మైనర్లకు మాత్రం ఈ చట్టం మినహాయింపు ఇచ్చింది.

40	కరీంనగర్‌లోని బైపాస్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో ప్రస్తుతం ఉంటున్న వారు.
45	కరీంనగర్‌లోని మానేరు డ్యాం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న వాసవి వృద్ధుల ఆశ్రమంలో ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నవారు.
15	కరీంనగర్‌లోని అమ్మ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారి సంఖ్య. ఇదీ నగరంలోని యజ్ఞ వరాహస్వామి ఆలయం సమీపంలో ఉంటుంది.
60	కరీంనగర్ రూరల్ మండలం పరిధిలోని ఇరుకుల్ల గ్రామంలో ఉన్న పద్మనాయక వృద్ధుల ఆశ్రమంలో ఉన్నవారి సంఖ్య.
14	సిరిసిల్ల పరిధిలోని రగుడుశివారులో టీటీ భూంరావు ఆశ్రమంలో ఉంటున్న వృద్ధుల సంఖ్య. ఇందులో 8మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నారు.
21	తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లగిశెట్టి విశ్వనాథం ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులు. ఇందులో పదిహేను మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఉంటున్నారు.
19	రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారు.
14	పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పట్టణంలో శ్రీధర్మశాస్త్ర ఆశ్రమం 30మందితో 2012లో ప్రారంభం అయ్యింది. ప్రస్తుతం 14మంది వృద్ధులు ఉంటున్నారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి యువకుడి మృతి

- ఇంజక్షన్ ఇచ్చిన 15 నిమిషాలకు అస్వస్థత
- మృతుని బంధువుల ఆందోళన
- సిరిసిల్లలో కిలోమీటరున్నర శవయాత్ర



సిరిసిల్లలో ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు



సిరిసిల్ల ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య



తిరుపతి(ఫైల్)

సిరిసిల్ల/చందుర్తి(వేములవాడ): ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మండలంలోని కొండాపూర్ పంచాయతీ పరిధిలోని హనుమాన్‌తండాలో శనివారం విషాదం నెలకొంది. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోయాయని.. న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు సిరిసిల్లలో ధర్నా చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాలు. లకావత్ తిరుపతి(30) రెండు రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. నిమ్మపల్లిలోని ఆర్‌ఎంపీ వైద్యుడు ప్రసాద్ వద్దకు వెళ్లగా అతను ఇంజక్షన్ ఇచ్చారు. తర్వాత 15 నిమిషాలకు తిరుపతి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆర్‌ఎంపీ వైద్యుడు తన కారులో సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. ఆస్పత్రి లోపలికి తరలించే క్రమంలోనే తిరుపతి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, కుటుంబసభ్యులు కోనరావుపేట మండలం కొలనూర్ శివారులో శవంతో రోడ్డుపై బైఠాయించారు. చందుర్తి, సిరిసిల్ల పట్టణ సీఐలు కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడినా శాంతించలేదు. చివరికి సీఐలు జోక్యం చేసుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు.

వారంలో గల్ఫ్ వెళ్లేవాడు

మరో వారం రోజుల్లో గల్ఫ్ వెళ్లేవాడు. గతంలో గల్ఫ్ వెళ్లి ఏడాన్నర క్రితమే స్వగ్రామం వచ్చి పెళ్లి చేసుకున్నాడు. మృతునికి ఏడాది కుమారుడు, భార్య భారతి ప్రస్తుతం గర్భవతి.

క్లీనిక్ సీజ్

గిరిజన యువకుడి మృతికి కారణమైన నిమ్మపల్లికి చెందిన ఆర్‌ఎంపీ చేపూరి ప్రసాద్ క్లీనిక్‌ను డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు శనివారం సాయంత్రం సీజ్ చేశారు. కోనరావుపేట మెడికల్ ఆఫీసర్ వేణుమాధవ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సిరిసిల్లలో ఉద్రిక్తం

తిరుపతి శవాన్ని నిమ్మపల్లికి తీసుకెళ్లి ఆర్‌ఎంపీ ఇంటి ముందు వేయాలని మృతుడి బంధువులు ప్రయత్నించారు. ఈక్రమంలో పోస్టుమార్టం వద్ద ఉన్న శవాన్ని ఎత్తుకొని వెళ్లేందుకు గ్రామస్తులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అయినా.. పోలీసులను దూషిస్తూ మృతుడి బంధువులు కోనరావుపేటమార్గంలో ముందుకు సాగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారి జరిగిన తోపులాటలో మృతుడి బంధువులు, పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల తీరును నిరసిస్తూ.. పలు చోట్ల శవంతో రాస్తారోకో చేశారు. అదనపు పోలీసు బలగాలను రప్పించి సిరిసిల్ల పట్టణ శివారులోని కొత్తచెరువు కట్ట వద్ద శవయాత్రను అడ్డుకున్నారు. ఎట్టకేలకు డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేశ్, పలువురు ఎస్సైలు, మహిళా ఎస్సైలు, పోలీసులు తిరుపతి శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఫలించని చర్చలు

ఆర్‌ఎంపీ వైద్యుడి ఇంజక్షన్ వికటించి తిరుపతి మరణించాడని, తిరుపతి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సదరు ఆర్‌ఎంపీ డాక్టర్ ప్రసాద్ రూ.2లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. తిరుపతి గతంలో ఉపాధి కోసం పదేళ్ల పాటు గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చాడు. అతని భార్య భారతి ఇప్పుడు గర్భవతి కాగా, కొడుకు స్నేహిత్, తల్లిదండ్రులు హంసవ్వ, గోపాల్ ఉన్నారు. తిరుపతి మృతి అటు కొండాపూర్‌హన్మాన్ తండాలో విషాదం నింపగా.. జిల్లా కేంద్రమైన సిరిసిల్లలో ఉద్రిక్తతకు దారితీసింది. సిరిసిల్ల పోస్టుమార్టం వద్ద శనివారం అర్ధరాత్రి వరకు పోలీసు బలగాలు రక్షణగా ఉన్నాయి. ఇరువర్గాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి.

శాసనమండలిలో మనోళ్లకు చోటు

- చీఫ్‌విప్‌గా భానుప్రసాద్.. విప్‌గా కౌశిక్





తానిపర్తి భానుప్రసాద్‌రావు విప్ పాడి కౌశిక్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా శాసన మండలికి ఎన్నికైన తానిపర్తి భానుప్రసాద్‌రావును చీఫ్‌విప్‌గా, ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డిని విప్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

- భానుప్రసాద్‌రావు 2009లో కాంగ్రెస్ నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం టీఆర్‌ఎస్ పార్టీలో చేరి 2014లో మరోసారి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ముచ్చటగా మూడోసారి మళ్లీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 2021 డిసెంబర్ 14 న జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. గతంలో భానుప్రసాద్‌రావు శాసనమండలి విప్‌గా పనిచేశారు.
- శాసనమండలి విప్‌గా ఎంపికైన పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం కాంగ్రెస్ క్యాడర్‌తో సహా టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కౌశిక్‌రెడ్డిని మొదటగా గవర్నర్ కోటా నుంచి ఎమ్మెల్సీగా ప్రభుత్వం నామినేటెడ్ చేయగా గవర్నర్ నిరాకరించారు. దీంతో ఆయనను ఎమ్మెల్యేల కోటా కింద శాసన సమండలికి పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. తాజాగా శాసనమండలి విప్‌గా కేబినెట్ ర్యాంకును కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీని కరీంనగర్ జిల్లాలో తిరుగులేని శక్తిగా తయారు చేసేలా అధిష్టానం నిర్ణయం తీసుకుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- రుద్రంగి పోలీస్‌స్టేషన్ తనిఖీ



రుద్రంగి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

రుద్రంగి(వేములవాడ): ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలుచేస్తూనే నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారితో కలిసి శనివారం రుద్రంగి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను రుద్రంగి ఎస్సై ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా, నేరాలు జరుగకుండా ఉండేందుకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే పోలీసుల లక్ష్యమన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగవంతంగా స్పందించాలన్నారు. ఏకీకృత సేవల కోసం ప్రవేశపెట్టిన ఫంక్షనల్ వర్టికల్స్ సమర్థంగా అమలయ్యేలా చూడాలన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రుద్రంగి ఎస్సై ప్రభాకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

20 వాహనాలకు జరిమానా



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 20 మందికి పోలీసులు శనివారం జరిమానా విధించారు. సదరు వాహనాలను ఠాణాకు తరలించారు. రాచర్లగొల్లపల్లి శివారు, ఎల్లారెడ్డిపేట, దూమాల ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్సై శేఖర్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. నంబరుప్లేట్ లేని వాహనాలపై ప్రయాణించడం, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఎస్సై కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కారు, బైక్ ఢీ



ఘటన స్థలంలో కారు, ద్విచక్రవాహనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో శనివారం కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రాచర్లగొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న కారు ఎదురుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్లకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలపై విరిగిపడ్డ చెట్టు



విద్యుత్ తీగలపై కూలిన వృక్షం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సింగారంలో చెట్టుకొమ్మ విద్యుత్ తీగలపై శనివారం విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఓ చెట్టు ఎండిపోయి విద్యుత్‌తీగలపై పడడంతో తెగి కిందపడ్డాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో సమీప ఇళ్లలోని ప్రజలు పరుగులు తీశారు. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో వెంటనే విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరాను నిలిపివేశారు. గ్రామంలో నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం ఆవునూర్, తుర్కపల్లి మానేరు వాగువద్ద ఐదు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పట్టుకున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహా జాతరకు నాంపల్లిగుట్ట ముస్తాబు



నాంపల్లి గుట్టపై కాళీయమర్దనం

వేములవాడఅర్బన్: దక్షిణకాశీ వేములవాడ రాజన్న ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు నాంపల్లిగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. రాజన్న అనుబంధ ఆలయం కావడంతో అధికారులు రంగులు వేయిస్తున్నారు. మహాశివరాత్రి జాతర కోసం ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభించారు. గుట్టపైకి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసే పనిలో నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తెలిపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు

- నాంపల్లి గుట్టపైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ముందు తడుకల పందిళ్లు వేశారు.
- క్యాంటీన్ ముందు భక్తులకు నీడ కోసం తడుకల పందిళ్లు వేశారు.
- కాళీయమర్దనం ముందు, క్యూలైన్‌పైన నీడ కోసం తడుకల పందిళ్లు వేశారు.
- ఘాట్‌రోడ్డు ముఖద్వారం కమాన్‌కు రంగులు వేశారు.
- ఘాట్‌రోడ్డు ప్రమాదకరమైన చోట ఇనుప రేలింగ్‌ను ఏర్పాటు చేశారు.

గుట్టపై ఇంకా చేయాల్సిన పనులు

- గుట్టపై క్యాంటీన్‌ల వద్ద రెండు చోట్ల తాత్కాళిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయనున్నారు.
- గుట్టపై ఉన్న కోనేరును శుభ్రం చేయించి, నీటిని నింపనున్నారు.
- కాళీయమర్దనంకు, ఘాట్‌రోడ్డుకు, నరసింహస్వామి ఆలయానికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ చేయనున్నారు.
- గుట్టపై నాలుగు రోజుల పారిశుధ్యం నిర్వహణకు సుమారుగా 120 మందిని ఏర్పాటు చేయనున్నారు.
- నాలుగు రోజులు గుట్టపై మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



మహాశివరాత్రి జాతరకు నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాము. ఇప్పటికే పనులు ప్రారంభించాం.

– నరేందర్, నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి

మోడల్‌స్కూల్ పిలుస్తోంది



వీర్నపల్లిలోని మోడల్‌స్కూల్

- ఈనెల 15 వరకు దరఖాస్తులకు గడవు
- ఏప్రిల్ 16న ప్రవేశపరీక్ష

వీర్నపల్లి(సిరిసిల్ల): జిల్లాలోని మోడల్‌స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. ఈనెల 15వ తేదీతో దరఖాస్తుల గడవు ముగియనుంది. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 16న నిర్వహించనున్నారు. మోడల్‌స్కూళ్లలో కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన చేయనున్నారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల విద్యార్థులకు వీర్నపల్లి మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరో తరగతిలో వంద మంది విద్యార్థులకు ప్రవేశ అవకాశం ఉంది. 7 నుంచి 10వ తరగతి వరకు వివిధ కారణాలతో ఖాళీ అయిన సీట్లను భర్తీ చేయనున్నారు. దరఖాస్తులను http//telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలి.

రెండు మండలాల విద్యార్థులకు ప్రాధాన్యం



వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట.. రెండు మండలాల విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేస్తాం.

– కె.విశ్వనాథం ప్రిన్సిపాల్

గోల్కొండ ఖిల్లాపై కాషాయజెండా ఎగురవేస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడరూరల్: రానున్న రోజుల్లో గోల్కొండ ఖిల్లాపై త్వరలోనే కాషాయజెండా ఎగురవేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. వేములవాడరూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్‌లో ఆధ్వర్యంలో ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు తెలంగాణ బలవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రతీ ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ వేములవాడ రూరల్ మండలాధ్యక్షుడు జక్కుల తిరుపతి, ఎంపీపీ బండ మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బూత్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి చెట్టిపల్లి రవీందర్, చిందం కుమార్, గంగుల ప్రసాద్, బోగోజు అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

13న జాతీయ రహదారి దిగ్బంధం

వీర్నపల్లి(సిరిసిల్ల): వర్గీకరణ చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 13న హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా కో–ఆర్డినేటర్ కానపురం లక్ష్మణ్ కోరారు. వీర్నపల్లిలో శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఈనెల 15న అనాథ పిల్ల లను ఆదుకోవడంలో విఫలమైన బీఆర్ఎస్ తీరుకు నిరసనగా నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. భగవంతం, వడ్లూరి రాజం, బాబు, శంకర్, సతీశ్, రాజం, లక్ష్మణ్, దేవయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న కానపురం లక్ష్మణ్

నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలి

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు
- బోయినపల్లిలో బీజేపీ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు, నారాయణపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. బోయినపల్లిలో శనివారం అసెంబ్లీ కో–కన్వీనర్ ఉదారి నర్సింహాచారి అధ్యక్షతన స్ట్రీట్‌కార్నర్ సమావేశం జరిగింది. కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తన స్వగ్రామం చింతమడకకు చేసిన ఆర్థికసాయం పలు ప్రాజెక్టుల నిర్వాసితుల కుటుంబాలకు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు బోగోజి గంగాధర్ చారి, సారంపల్లి రాజు, రాజూరి కిరణ్, కొనుకటి హరీశ్, కన్నం రాజు, అనిల్ ఉన్నారు.



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కేసుల సత్వర పరిష్కారానికి అదాలత్

- అదాలత్‌లో తీర్పు అంతిమం
- రాజీయే రాజమార్గం
- జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లటౌన్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంటున్న కేసుల సత్వర పరిష్కారమే జాతీయ లోక్‌అదాలత్ లక్ష్యమని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. సిరిసిల్ల కోర్టుహాల్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో మాట్లాడారు. అదాలత్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రాజీపడితే కలిగే లాభాలు వివరించాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్న విషయాన్ని వివరించాలన్నారు. అదాలత్‌లో తీర్పు అంతిమం అనే విషయాన్ని అవగాహన కల్పించాలన్నారు. న్యాయసేవాసమితి ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమలత

1,209 కేసులు పరిష్కారం

సిరిసిల్ల, వేములవాడల్లోని కోర్టు కాంప్లెక్సులలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1,209 కేసులు నమోదయ్యాయి. వివిధ బ్యాంకులు, ప్రమాదబీమా కేసుల్లో రూ.26,55,746 విలువైన లావాదేవీలు సెటిల్ అయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య, న్యాయ సేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.

రాజీమార్గంతో కేసులు పరిష్కారం

వేములవాడ: రాజీమార్గంతోనే కేసులకు పరిష్కారం లభిస్తుందని, చిన్నపాటి గొడవలతో కేసుల పాలు కావద్దని సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్, జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్‌సిహాగ్ కోరారు. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా శనివారం వేములవాడలో 471 కేసులు పరిష్కారమయ్యాయి. రాజీతో రెండువర్గాలు గెలిచినట్లేనన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్‌రెడ్డి, లోక్‌అదాలత్ మెంబర్లు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, నక్క దివాకర్, పొత్తూరి అనిల్ కుమార్, రామ్‌రాజు, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



వేములవాడలో వేదికపై న్యాయమూర్తులు

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

- డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు. వేములవాడటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం పట్టణంలోని వ్యాపారులు, అద్దెగదుల నిర్వాహకులు, ఆటోకార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చే భక్తులకు వీలైతే సహాయం చేయాలన్నారు. అద్దెగదుల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఐడీకార్డులు ఉన్న వారికి మాత్రమే గదులు అద్దెకు ఇవ్వాలన్నారు. వ్యాపారులు సైతం అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు రోడ్డును ఆక్రమించొద్దన్నారు. సీఐలు వెంకటేశ్, బన్సీలాల్, ఎస్సైలు వెంకట్రాజం, రఫీక్‌ఖాన్, ఆటో యూనియన్ అధ్యక్షుడు బత్తుల దేవరాజు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు, వ్యాపారుల సంఘం అధ్యక్షుడు పిన్నింటి హన్మండ్లు, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, మంజ ఉమేందర్‌గౌడ్, లింగంయాదవ్, అంజాద్‌పాషా పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ధర్మపురి: నాగారం గ్రామానికి చెందిన పసుల అనిల్ మృతికి కారణమైన రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. కమలాపూర్ మార్గంలోని పెట్రోల్ బంక్ సమీపంలో అస్తవ్యస్తంగా రోడ్డు నిర్మించడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి అనిల్ మృతి చెందాడని ఆరోపించారు. శనివారం జరిగిన యువకుడి అంత్యక్రియలకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. ఎస్.దినేశ్, వేముల రాజేశ్, చిలుముల లక్ష్మణ్, మొగిలి, గడ్డం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మల్యాల(చొప్పదండి):బహిర్భూమి కోసం వెళ్లి ప్ర మాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్యాల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం టీఆర్ నగర్‌కు చెందిన షేక్ ఖాదర్(47)ను భార్య గతంలోనే వదిలేసి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసై, భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 8న సాయంత్రం నుంచి ఖాదర్ కనపడకుండా పోయాడు. టీఆర్‌నగర్ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఖాదర్ చెప్పులు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. కాలువలో పడి ఉంటాడని కాలువ వెతకగా, లంబాడిపల్లి సమీ పంలోని ఎస్సారెస్పీ సైఫన్ వద్ద శవమై కనిపించాడు. శవాన్ని బయటకు తీశారు. మృతుడి అన్న షేక్ ఖలీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ధర్మపురి: రోడ్డు పక్క నుంచి కాలినడకన వెళ్తున్న వ్యక్తిని కారు వెనుకనుంచి ఢీకొట్టడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కుంటాల బీరయ్య(40) శనివారం రాత్రి కిరాణంలో వస్తువులు కొనుగోలు చేసేందుకు రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనుక నుంచి అతి వేగంగా దూసుకు వచ్చిన కారు బలండగా ఢీకొట్టడడంతో బీరయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు కొంతకాలం క్రితమే చనిపోయారు. బీరయ్య తన అక్కాబావల సంరక్షణలో ఉంటున్నాడు. మృతుడు అవివాహితుడు. సమాచారం అందుకున్న ఏఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాలలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ట్యాంకర్ నుంచి డీజిల్ లీక్

మెట్‌పల్లి(కోరుట్ల): పెట్రోల్ బంక్‌కు డీజిల్‌ను సరఫరా చేసే ఓ ట్యాంకర్ నుంచి ఇంధనం లీకైంది. ఎలాంటి ప్రమాదం జరుగలేదు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో ఉండే ఓ బంక్‌కు ఘట్‌కేసర్ నుంచి ఓ ట్యాంకర్‌లో శుక్రవారం రాత్రి డీజిల్ సరఫరా చేశారు. ట్యాంకర్ ఓ చోట దెబ్బతినడంతో ఆర్మూర్ నుంచి ఇంధనం లీకవుతూ వచ్చింది. ఈ విషయంలో డ్రైవర్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. పట్టణంలోని బంక్ వరకూ ట్యాంకర్‌ను అలాగే తీసుకొచ్చాడు. గమనించిన బంక్ నిర్వాహకులు.. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ బిల్లు పేరుతో సైబర్ నేరగాళ్ల వల

జగిత్యాలక్రైం: వృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కూడా తమ మోసాలకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించాలంటూ కొందరికి శనివారం మెసేజీలు పంపించారు. బిల్లులు వెంటనే చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని పేర్కొన్నారు. తక్షణమే 62979 61688 నంబరులో సంప్రదించాలని సూచించారు. బిల్లులు చెల్లించిన వారికి ఈ మేసెజ్ రావడంతో అప్రమత్తమైన వినియోగదారులు.. సైబర్ నేరగాళ్ల కుట్రను పసిగట్టి బూతులు తిట్టి ఫోన్ పెట్టేశారు.

అవినీతి కల్వకుంట్ల పాలనను తరిమికొట్టాలి



మాట్లాడుతున్న తుల ఉమ

- జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): బంగారు తెలంగాణ అంటూ పేదలను మోసం చేస్తున్న అవినీతి కల్వకుంట్ల కుటుంబ పాలనను ప్రజలు తరిమికొట్టాలని బీజేపీ నాయకురాలు, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ కోరారు. తక్కళ్లపెల్లి, సిరికొండ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రోజురోజుకూ అవినీతి పెరిగిపోతోందన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి ఓట్ల కోసం హామీలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. రైతులకు మేలు చేసే సూరమ్మ, రాళ్లవాగు ప్రాజెక్టుల విషయంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు మొలిగె శ్రీనివాస్, మల్యాల మారుతి, జిల్లా సత్యం, నరెడ్ల రవీందర్‌రెడ్డి, మేడిపెల్లి గంగాదర్, ప్రతాప్‌రెడ్డి, మహేశ్, లోకిని గంగనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కను కలిసిన రైతు నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని రైతు ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నడుపుతామని తెలంగాణలో జరిగిన మొదటి ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీఆర్ఎస్.. ఆ పని చేయకుండా.. నడిచే ఫ్యాక్టరీని మూసివేసిందని వివరించారు. అప్పటి నుంచి ఈ ప్రాంత రైతులు చెరుకును కామారెడ్డి ఫ్యాక్టరీకి తరలించడంతో రవాణాభారం పడుతోందని తెలిపారు. శాసనసభలో ఈ అంశాన్ని ప్రస్తావించి పునరుద్ధరణ కోసం పార్టీ తరఫున కృషి చేస్తామని భట్టి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఇందులో మామిడి నారాయణరెడ్డి, గురిజెల రాజిరెడ్డి, షేర్ నర్సారెడ్డి, లింబాద్రి, నగేశ్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు